
ఫ్యూచర్ సిటీలో 'మారుబేనీ' పార్క్

- రూ.1000 కోట్ల పెట్టుబడి...
- సిఎం రేవంత్ సమక్షంలో ఎంఒయు



మారుబేని కంపెనీ యాజమాన్యంతో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. జపాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపార దిగ్గజం మారుబేని కంపెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత తెలిపింది. టోక్యోలో ఆ కంపెనీ ప్రతినిధులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ. 1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబేని కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దీంతో దాదాపు రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడును ఆకర్షించే అంచనాలున్నాయి. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీకి మారుబేనికి స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరపున తగినంత మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, అందులో మారుబేని పెట్టుబడులకు ముందుకురావటం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంతో జపాన్ కు ఏళ్లకేళ్లుగా ఉన్న స్నేహ సంబంధాల దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగా భావిస్తారని ముఖ్యమంత్రి మాటిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ దై సకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని అన్నారు. మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ మరియు మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను నియమించింది.

సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సిఎం బృందం

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్ లో సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోని కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బందాన్ని కలుసుకుంది. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అధికారిక పర్యటనలో భాగంగా సోనీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఆ కంపెనీ ప్రతినిధులు ప్రదర్శించారు. ఉత్పత్తులతో పాటు వారి పని తీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సోనీ కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్‌తో వివరణాత్మక చర్చలు జరిపింది. యానిమేషన్, వీఎఫ్ఎక్స్ మరియు గేమింగ్ రంగాలలో హైదరాబాద్ లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. ఎండ్-టు-ఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన భవిష్యత్తు విజన్? ను వారితో పంచుకున్నారు.

మహిళా హక్కుల రక్షణకే యాత్ర

- కులాంతర వివాహితుల రక్షణ చట్టం తీసుకురావాలి : మల్లు లక్ష్మి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళా హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా.. అంబేద్కర్, జ్యోతిరావ్ ఫూలే యాదిలో వారి ఆశయాల సాధన దిశగా ఐద్వా ఆధ్వర్యంలో మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర చేపట్టినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. బస్సు యాత్ర గురువారం హనుమకొండ, హుజురాబాద్ మీదుగా కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ వద్ద ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారి యాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం సభలో రాష్ట్ర మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు కృషిని కొనియాడారు. అదే బాటలో జ్యోతిరావ్ ఫూలే మహిళలకు విద్య, ఉపాధి, హక్కుల కోసం పాటుపడ్డారని తెలిపారు. దేశంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అవమానాలు, వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఇంటిలో వరకట్న వేధింపులు, హత్యలు పెరుగుతున్నాయని అన్నారు. మహిళలపై నేరాల నివారణకు కఠిన చట్టాలు రూపొందించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పోర్న్ వెబ్‌సైట్ల వల్ల యువత, పిల్లలపై దుష్ప్రభావం పడుతోందని, వాటిని వెంటనే నిషేధించాలని కోరారు. కులాంతర వివాహితుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రకు రైతు సంఘం మాజీ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షులు వర్ల వెంకటరెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సాగర్, డివైఎఫ్ఐ నేతలు జి.తిరుపతి, నరేష్ పటేల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కెఎన్.ఆశాలత, నల్లగొండ రత్నమాల, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ధ్యావా అన్నపూర్ణ, నగర కార్యదర్శి చేని రోజా, సహాయ కార్యదర్శి మంచినీళ్ల లావణ్య, జిల్లా నాయకులు ఉప్పునూటి లక్ష్మి, మేదర నాగమణి, భవాని, రామ, రజిని, మానస, మున్న, అంజలి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి డబుల్ హార్స్‌కు అవార్డ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెనాలి డబుల్ హార్స్ గ్రూప్‌నకు మరో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించిందని ఆ సంస్థ తెలిపింది. యుఆర్ఎస్ మీడియా, ఆసియా వన్ మ్యాగజైన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 25వ ఆసియన్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్ కార్యక్రమంలో సంస్థకు ఇండియాస్ ఫాస్టెస్ట్ గ్రోయింగ్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ 2024-25 అవార్డు దక్కినట్లు తెలిపింది. ఈ పురస్కారాన్ని ఆ కంపెనీ సిఎండి మునగాల మోహన్ శ్యాం ప్రసాద్ అందుకున్నారు. ఈ గౌరవం తెనాలి డబుల్ హార్స్ కుటుంబానికి మాత్రమే కాక, మాతో కలిసిన ప్రతి వినియోగదారుడు, డిస్ట్రిబ్యూటర్, భాగస్వామి నమ్మకానికి అద్దంపడుతోందన్నారు.

జూబ్లీహిల్స్‌లో 'గ్లో బై కీర్తిలాల్స్' ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ కీర్తిలాల్స్ కొత్తగా జూబ్లీహిల్స్‌తో తన సరికొత్త ప్రత్యేక షోరూం 'గ్లో బై కీర్తిలాల్స్' ప్రత్యేక షోరూంను ప్రారంభించినట్లు తెలిపింది. దీంతో దేశంలో తమ బ్రాండ్ ఉనికి పెరుగుదలకు మైలురాయిగా నిలుస్తుందని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ పేర్కొన్నారు. నూతన స్టోర్‌లో సిగ్నేచర్ ఆభరణాలను, సొగసైన, తేలికపాటి సహజ వజ్రాలు, బంగారు ఆభరణాలు లభిస్తాయన్నారు.

రాఘవ నుంచి కొత్త 'సిన్క్' హైరైజ్ ప్రాజెక్ట్



హైదరాబాద్ బ్యూరో : ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ రాఘవ తాజాగా సింక్ బై రాఘవను ప్రకటించింది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఈ ప్రీమియం లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తెస్తోన్నట్లు గురువారం వెల్లడించింది. 7.19 ఎకరాల్లో విస్తరించి ఉన్న రాఘవ 'సిన్క్'లో ఐదు టవర్లను 61 అంతస్తుల చొప్పున నిర్మించనున్నట్లు రాఘవ మేనేజింగ్ డైరెక్టర్ హర్ష రెడ్డి పొంగులేటి తెలిపారు. కొనుగోలుదారుల కోసం జాగ్రత్తగా రూపొందించబడిన ప్రతి ఇల్లు, లైటింగ్ , భద్రత కోసం తెలివైన ఇంటి ఆటోమేషన్ ద్వారా విశాలమైన జీవనాన్ని అందిస్తుందన్నారు. సిన్క్ బై రాఘవ మరొక నివాస సముదాయం మాత్రమే కాదని ఇది ఒక హై-ఎండ్ ఆర్కిటెక్చరల్ అద్భుతం కానుందన్నారు.

మెట్రో, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

- జైకా యాజమాన్యంతో తెలంగాణ రైజింగ్ బృందం చర్చలు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులను సమీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం జైకాతో చర్చలు జరిపింది. జపాన్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బందం గురువారం జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఉన్నత యాజమాన్యంతో సమావేశమైంది. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ షోహేయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని జైకాను కోరింది. పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సానుకూల విధానాలు, ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా హైదరాబాద్ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ. 24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని జైకా బందానికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం.. అంటే రూ.11,693 కోట్లు. రుణం అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా పాటిస్తుందని చెప్పారు. మెట్రో తో పాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరియు కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో లాంటి ప్రపంచ నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే తన ఆలోచనలను ముఖ్యమంత్రి వారితో పంచుకున్నారు. జైకాకు, తెలంగాణతో ఏళ్లకేళ్లుగా సంబంధాలున్నాయని జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ షోహేయ్ హరా అన్నారు. మెట్రో రైలు విస్తరణతో పాటు, అర్హతలున్న ఇతర అభివద్ధి ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, మెట్రో రైలు ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

450 ఎకరాల్లో ఐటి నాలెడ్జ్ హబ్

- ఐదు లక్షల మంది యువతకు ఉపాధి
- డిప్యూటీ సిఎం భట్టి అధ్యక్షతన సమావేశమైన మంత్రులు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పుప్పాలగూడ పరిసరాల్లో సుమారు 450 ఎకరాల్లో ఐటి నాలెడ్జ్ హబ్(మొదటి దశ) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో సిఎస్ శాంతి కుమారి, పరిశ్రమలు, రెవెన్యూ శాఖ కీలక అధికారులతో వారు ఇదే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. పుప్పాలగూడ పరిసరాల్లో ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఐఎఎస్ అధికారుల కోసం ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయించిందని తెలిపారు. వీరితోపాటు రెవిన్యూ అధికారులు, స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ సొసైటీ తదితరాలకు అక్కడ సుమారు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. పుప్పాలగూడ పరిధిలో సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు సబ్ కమిటీకి నివేదించారని వివరించారు. ఈ భూమికి పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు 250 ఎకరాల భూమి ఉందంటూ అధికారులు ఈ సందర్భంగా మంత్రులకు తెలిపారు. మొత్తంగా ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి సుమారు 450 ఎకరాలు అందుబాటులో ఉందని చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఈ హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన జరిగిందనీ, ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ ఏర్పాటయిందని వారు గుర్తు చేశారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రూపు దిద్దుకుందనీ, ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులో హైదరాబాద్ భాగస్వామి అయిందని చెప్పుకొచ్చారు. ఇప్పుడు కూడా ఐటీ రంగంలో ఏఐ టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ ఆకాంక్షించింది. ఈ రకంగా అభివృద్ధిని కొనసాగించే క్రమంలో పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్ అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని మరింత స్థాయికి చేర్చాలని వారు నిర్ణయించారు.

తొమ్మిది గంటల పాటు కీహోల్ శస్త్ర చికిత్స

- మహిళ కిడ్నీలు కాపాడిన ప్రీతి యూరాలజీ వైద్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నగరానికి చెందిన ఒక మహిళకు తొమ్మిది గంటల పాటు సుదీర్ఘంగా కీహోల్ శస్త్రచికిత్స చేసి, రెండువైపులా మూత్రనాళాలను మార్చినట్లు ప్రీతి యూరాలజీ హాస్పిటల్ ఎండి, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ చంద్రమోహన్ తెలిపారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ బృందం సుదీర్ఘ చికిత్సతో ఆమె రెండు కిడ్నీలను కాపాడిందన్నారు. “52 ఏళ్ల ఓ మహిళకు మూడేళ్ల క్రితం గర్భసంచి తొలగించినప్పుడు.. ఇన్ఫెక్షన్ కారణంగానో, మరో కారణం చేతనో ఆమె రెండు మూత్రనాళాలుపై నుంచి కిందివరకు మొత్తం పాడైపోయాయి. ఇలా జరగడం అత్యంత అసాధారణం. కేవలం పైన కిడ్నీ తొడిమ మాత్రమే మిగిలింది. సమస్య మరీ తీవ్రతరం కావడంతో.. కిడ్నీల పనితీరు కూడా దెబ్బతింది. పైనుంచి కింది వరకు మొత్తం 35 సెంటీమీటర్ల మేర మూత్రనాళాలు అంతా పాడైపోవడంతో వాటిని సరిచేయడం కూడా చాలా కష్టం అవుతుంది. దాంతో ఈమెకు లాప్రోస్కొపిక్ పద్ధతిలో శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. సాధారణంగా లాప్రోస్కొపిక్ శస్త్రచికిత్సల్లో మూడు చిన్న రంధ్రాలే చేస్తాం. కానీ ఈమెకు పైన, కింద, ముందు, వెనక అన్నీ చూడాల్సి రావడంతో 13 రంధ్రాలు పెట్టి చేశాం. రోగి మూత్రనాళాలు పూర్తిగా పాడైపోయి, సన్నగా అయిపోవడంతో అవి ఎందుకూ పనికిరావు. అందువల్ల చిన్న పేగుల్లోంచి 35 సెంటీమీటర్లను రెండు భాగాలుగా తీసుకుని వాటిని కిడ్నీ తొడిమ నుంచి బ్లాడర్‌కు రెండువైపులా అమర్చి కలిపి కుట్టాం. ఈ శస్త్రచికిత్సకు మొత్తం తొమ్మిదిన్నర గంటల సమయం పట్టింది. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత రోగి లేచి నడవగలుగుతున్నారు. ఆమె సాధారణ స్థాయికి చేరుకుంది” అని డాక్టర్ చంద్రమోహన్ వివరించారు.

నాటక రంగం మరుగు పడలేదు

- ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు

ప్రజాశక్తి కల్చరల్

నాటక రంగం మరుగు పడలేదని, ఉత్తమ ప్రదర్శనలను ఆదరించే ప్రేక్షకులు వున్నారని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు . ఇందుకు ఉదాహరణ ఈ మంచం నాది కాదు నాటికకు హాజరైన ప్రేక్షక జనమని అయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ రేలంగి ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో మహతి క్రియేషన్స్ (హైద్రాబాద్)వారిచే గోవిందరాజుల నాగేశ్వరరావు రచించిన 'ఈ మంచం నాది కాదు' హాస్య నాటికను బందా రాజ గోపాల్ దర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఈ నాటికలో అంతర్గతంగా సమాజానికి సందేశం అందించారు అన్నారు. చెవి పుల్లలు మాల్‌లో కొన్న వ్యక్తికి లాటరీలో బహుమతి వచ్చిందని ఫోన్‌లో చెప్పి ఇంటి చిరునామా తెలుసుకుని రాత్రి పూట దొంగతనం చేయటానికి వస్తారనే అంశంపై కథ అల్లి చెప్పటం బాగుందని కొనియాడారు. ప్రముఖ నటుడు సుబ్బరాయ శర్మ మాట్లాడుతూ ఏప్రిల్ 16 కందుకూరి వీరేశలింగం జయంతి తెలుగు రంగస్థల దినోత్సవంగా జరుపుకుంటున్నామనీ ఆ సందర్భం పురస్కరించుకొని వంశీ రామరాజు నాటకాలను ప్రోత్సహిస్తున్నారు అని చెప్పారు. వేదికపై ఉగాండా నుంచి పాల్గొన్న బూరుగుపల్లి వ్యాస కష్ణ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు స్వాగతం పలికారు. రేలంగి ఆర్ట్స్ కార్యదర్శి అర్ నారాయణ రావు నివేదిక సమర్పించగా సుంక్తరపల్లి శైలజ సుధామయి తదితరులు పాల్గొన్నారు తొలుత వైఎస్ రామకృష్ణ బృందం సినీ హాస్య గీతాలు ఆలపించారు.

జవాబుదారీతనాన్ని పెంచేందుకే భూ భారతి

- భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ఉపయోగపడుతుంది
- ధరణి పేరుతో పేదల భూములను కొల్ల గొట్టిన బిఆర్ఎస్ : మంత్రి పొంగులేటి
- తల్లితో బిడ్డది బంధం.. భూమితో రైతుది అనుబంధం : స్పీకర్ గడ్డం



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వానికి, రైతులకు మధ్య జవాబుదారీతనాన్ని పెంచేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, ఈ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో పేదల భూములను కొల్లగొట్టారన్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం భూ భారతిలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో భూ భారతిపై గురువారం స్థానిక రైతు వేదికలో ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి మంత్రి హాజరై మాట్లాడారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్న మాటకు కట్టుబడి భూ భారతి రూపొందించినట్టు చెప్పారు. భూభారతి-2025 చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు, చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతుందని తెలిపారు. గతంలో 18 లక్షల ఎకరాల భూమిని, ప్రభుత్వ స్థలాలతో పాటు వారికి నచ్చిన విధంగా మార్చేసి పార్ట్-బి పేరుతో ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజల దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. వచ్చే జూన్ రెండవ తేదీ నాటికి మండలంలో భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ రెండవ తేదీ నుంచి మిగతా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని తీసుకుంటామన్నారు.

స్పీకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. రాజ్యాంగం ద్వారా ఈ దేశానికి దిశానిర్దేశం చేసిన రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బిఆర్ అంబేదర్ జయంతి నాడే భూ భారతి అమల్లోకి రావడం గొప్ప విషయమని తెలిపారు. తల్లితో బిడ్డది బంధం అయితే భూమితో రైతుది అనుబంధం అన్నారు. భూ భారతి అమలుతో రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. దేశ రక్షణ కోసం స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషితో రక్షణ దళానికి దామగుండం అటవీ ప్రాంతంలో శంకుస్థాపన చేయించారని అన్నారు. శాసనమండలి చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి పరిపాలన అందిస్తూనే నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు శిథిలావస్థలో ఉన్న పరిగి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు, నిర్మాణ పనులు చేపట్టాల్సిందిగా మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ భూ భారతి చట్టం విధి విధానాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి నారాయణరెడ్డి, ఆర్‌డిఒ వాసు చంద్ర, తహసీల్దార్లు భరత్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

ఎకో టూరిజంపై వేగంగా అడుగులు వేయండి

- పచ్చదనం పెంపునకు చర్యలు అవసరం
- అటవీ శాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఎకో టూరిజంపై వేగంగా అడుగులు వేయాలని అధికారులను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. విదేశీయులను కూడా ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దానికి సంబంధించి అటవీ, టూరిజం, పరిశ్రమల శాఖలతో కూడా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మరిన్ని చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం లోని అటవీ మంత్రి శాఖ పేషిలో 'తెలంగాణ హరిత నిధి' రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఒఎఫ్ఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూ సింగ్ మేరు, డాక్టర్ సువర్ణ (క్యాంపా), సిసిఎఫ్ డాక్టర్ జి రామలింగం (సోషల్ ఫారెస్టు), డాక్టర్ బీమా నాయక్, డాక్టర్ ప్రభాకర్ (సిసిఎఫ్), పలు జిల్లాల డిఎఫ్ఒలు, ఆర్థిక శాఖ సహా ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరితనిధి వినియోగంపై సమగ్ర చర్చించారు. 2024-25 హరిత నిధి బడ్జెట్, 2025-26 బడ్జెట్ మీద మంత్రి అనుమతులను అధికారులు స్వీకరించారు. నర్సరీలను ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, నీళ్లు పోయడం, సంరక్షించడం, మొక్కల లెక్కలు తేల్చడం, పచ్చదనంపై అవగాహన పెంచే కార్యక్రమాలు, ప్రణాళికల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ వంటి వాటిపై మంత్రి సురేఖ పలు సూచనలు చేశారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి మన రాష్ట్రం పట్ల చాలా సానుకూలంగా ఉన్నారని గుర్తు చేశారు. పెండింగ్ అంశాలుంటే త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అటవీ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రస్తుతం అవలంబిస్తున్న విధానాలపై ఆరా తీశారు. వాటి నివారణకు రానున్న రోజుల్లో మరింత శాస్త్రీయంగా ముందుకు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఎప్పటికప్పుడు తమకు తెలపాలని ఆదేశించారు.

వానరాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో వానరాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఒకసారి వనాలను వీడిన వానరాలు మళ్లీ అడవి బాట పట్టవనీ, అందువల్ల వాటి కోసం కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. హరిత నిధిలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇచ్చే మొక్కల్లో ఎక్కువగా వానరాలు తినే పండ్ల మొక్కలు అందజేయాలని సూచించారు. దాని వల్ల వాటిని సంరక్షించినట్టు అవుతుందని చెప్పారు. ఈ విషయంపై సమగ్రంగా నివేదికలు తయారు చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు.


ఆదివాసీ కుటుంబానికి అన్యాయం

- అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్టు?
- ఆత్మహత్యకు బాధ్యులపై చర్యలేవీ?
- కన్నయ్య కుటుంబానికి సిపిఎం, ప్రజాసంఘాల అండ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'ఆదివాసీ బిడ్డ నాయిని కన్నయ్య ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం.. కుటుంబ పెద్ద అయిన కన్నయ్య మృతితో ఆయనపై ఆధారపడిన కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు.. పెత్తందారు దుర్మార్గపు చర్యలతో ఆత్మహత్య చేసుకున్న కన్నయ్య కుటుంబానికి అన్యాయం జరిగితే అధికార యంత్రాంగం ఏం చేస్తోంది' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. పెత్తందారు దౌర్జన్యంతో ఆత్మహత్య చేసుకున్న మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య కుటుంబాన్ని టిఎజిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్‌తో కలిసి గురువారం జాన్‌వెస్లీ పరామర్శించారు.

కుటుంబ సభ్యులను ఓదార్చి తమ పార్టీ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకూ పోరాడుతామని భరోసా కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జాన్‌వెస్లీ మాట్లాడారు. ఆదివాసీలకు అన్యాయం జరుగుతుంటే అధికారులు ఏసీ రూముల్లో కూర్చోవడం తగదన్నారు. కన్నయ్య మృతికి కారకులైన ఎనుగంటి చిన్నన్న కుటుంబ సభ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. చిన్నన్నతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. సంవత్సరానికి రూ.10వేల జీతంతో రోజుకు 12గంటలు పని చేయించుకున్న చిన్నన్న 7నెలలుగా జీతం ఇవ్వకుండా పిచికారీ మందు డబ్బా చెడగొట్టాడని నోటికొచ్చినట్టు తిట్టడంతో మనస్థాపం చెంది కన్నయ్య ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కన్నయ్య పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడా? చిన్నయ్య కుటుంబ సభ్యులే పురుగుల మందు తాగించారా? అనే అనుమానం లేకపోలేదన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఈ కోణంలో కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కన్నయ్య మృతిచెంది 15 రోజులు కావస్తున్నా జిల్లా స్థాయి అధికారులెవరూ బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రజాప్రతినిధులు ఆదివాసీ కుటుంబాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కన్నయ్య కుటుంబానికి అండగా సిపిఎం

ఆదివాసీలు అమాయకులు.. ఏం జరిగినా ఎవరూ పట్టించుకోరు అనుకోవద్దు.. కన్నయ్య కుటుంబానికి సిపిఎం అండగా నిలుస్తుందని జాన్‌వెస్లీ అన్నారు. సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘాలతోపాటు ప్రజాసంఘాలు బాధిత కుటుంబానికి అండగా నిలిచి.. న్యాయం చేసే వరకు పోరాడుతాయని చెప్పారు. కన్నయ్య భూమిని ఆయన కుటుంబ సభ్యుల పేరుతో మార్పు చేయడమే కాకుండా ప్రభుత్వ పరంగా 5 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కన్నయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, కుమారున్ని ఉన్నస్థాయి వరకు చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రిని కలిసి కన్నయ్య కుటుంబానికి న్యాయం జరిపిస్తామని తెలిపారు. కన్నయ్య మాదిరి ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిని వారించి పోరాడాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కన్నయ్యకు సంబంధించిన భూమి పట్టామార్పిడి ఎలా జరిగిందని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఆదివాసీ గిరిజన సంఘం నాయుకులు ఎర్మ పున్నం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, ఎఆర్‌సిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరావు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ పిహెచ్‌డి సీట్ల కేటాయింపుపై విచారణ జరపాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు విశ్వవిద్యాలయం పిహెచ్‌డి సీట్ల కేటాయింపులపై ఉన్నత విద్యా మండలి విచారణ చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి తొమ్మిది కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాల భర్తీ కోసం గతనెల 17 నుంచి 20 వరకు తెలుగు విశ్వవిద్యాలయం మౌఖిక పరీక్షలను నిర్వహించిందని తెలిపారు. ఈనెల 15వ తేదీన విడుదల చేసిన ఆ పరీక్ష ఫలితాలు సామర్థ్యం, అర్హత కలిగిన విద్యార్థులకు నష్టం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. వర్సిటీ వారు స్వయంగా విడుదల చేసిన ప్రాస్పెక్టస్‌కి పూర్తి విరుద్ధంగా పిహెచ్‌డి సీట్ల కేటాయింపు జరిగిందని వివరించారు. ఇది వర్సిటీ ప్రతిష్టకే భంగం కలిగించేలా ఉన్నదని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడంలో వర్సిటీ విఫలమైందని విమర్శించారు. ప్రతిభ కలిగినవారికి, పరిశోధన చేయగలిగిన వారికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కాబట్టి ఉన్నత విద్యామండలి జోక్యం చేసుకుని తెలుగు విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాలపై విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.

ఇక్రిశాట్‌లో చిక్కిన చిరుత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని వ్యవసాయ క్షేత్రం ఇక్రిశాట్‌లో రెండు రోజులుగా సంచరిస్తున్న చిరుత పులి ని ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. చిరుతను పట్టుకునేం దుకు ఇక్రిశాట్ అధికారులు, అటవీ శాఖ అధికారులు బోన్లు, సీసీ కెమెరాలు బిగించారు. బుధవారం రాత్రి చిరుత కోసం ఏర్పాటు చేసిన బోన్‌ల వద్ద రెండు మేకలను ఏర్పాటు చేశారు. వాటిని వేటాడడానికి వచ్చిన చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కుకుంది. దాంతో అటవీ శాఖ అధికారుల శ్రమ ఫలించింది. దాంతో పాటు మరో చిరుత ఉన్నట్టు సమాచారం. దాన్ని కూడా పట్టుకుంటామని అధికారులు చెబుతున్నారు. చిక్కిన చిరుతను హైదరాబాద్‌లోని జూ పార్క్‌కు వాహనంలో తరలించారు. ఇదిలాఉండగా గతంలో ఇదే చోట రెండు సార్లు రెండు చిరుతలను అటవీశాఖ అధికారులు పట్టుకోవడం గమనార్హం. రెండు రోజులుగా చిరుత సంచరిస్తున్న విషయం తెలుసుకున్న ఇక్రిశాట్ కార్మికులు, ఉద్యోగులు భయంతో బయట తిరిగేందుకు భయపడ్డారు. ఎట్టకేలకు చిరుత చిక్కడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గుడ్‌ఫ్రైడే నేపథ్యంలో నేడు ప్రజావాణికి సెలవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుడ్‌ఫ్రైడే నేపథ్యంలో శుక్రవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించట్లేదని రాష్ట్ర నోడల్ అధికారి దివ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తిరిగి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22న తిరిగి నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి శుక్రవారం ప్రజాభవన్‌కు ఎవ్వరూ రావొద్దని సూచించారు.

బెట్టింగ్ యాప్‌తో మరో విద్యార్థి బలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లాకు చెందిన పవన్ (24) జెఎన్‌టియులో ఎంటెక్ చదువుతున్నాడు. అతను, తన ఇద్దరి స్నేహితులతో కలిసి నందిముసలిగూడలో ఒక రూమ్ అద్దెకి తీసుకొని ఉంటున్నారు. అయితే ఇటీవల అతడు బెట్టింగ్ యాప్‌లో లక్ష రూపాయలు పోగొట్టుకున్నాడు. తన వద్ద ఉన్న సెల్‌ఫోన్, బైక్ అమ్మి ఆ డబ్బులతో బెట్టింగ్ చేశాడు. అవి కూడా పోయాయి. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన పవన్ గురువారం తన స్నేహితులు ఇద్దరు గదిలో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం అతని స్నేహితులు రూమ్‌కు రాగా.. పవన్ ఫ్యాన్‌కు వేలాడదీస్తూ కనిపించాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ పెంచకుండా వికలాంగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బ్యాక్‌లాగ్ పోస్టులకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలి
- ఉపాధి హామీలో వికలాంగులకు జాబ్ కార్డ్స్ ఇవ్వాలి : ఎం అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు పింఛన్ రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. పింఛన్ పెంచకుండా వికలాంగులను మోసం చేస్తోందని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య అన్నారు. గురువారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) సంగారెడ్డి జిల్లా విస్తృత సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు ఎం. బస్వరాజు అధ్యక్షతన పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త పింఛన్ల కోసం 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకొని 15 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం అడివయ్య

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి, భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీలో వికలాంగులకు జాబ్ కార్డ్స్ జారీ చేసి 150 రోజులు పని కల్పించాలని కోరారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.మాణిక్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధర తగ్గించి అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై ఏడాదికి రూ.100 కోట్ల భారం మోపుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం అని చెప్పిన సిఎం.. రాష్ట్రాన్ని నిర్బంధాలతో పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సి.సాయమ్మ, కో కన్వీనర్ జయలక్ష్మి, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొనింటి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు రాంచందర్, కుమ్మరి నర్సిములు, సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు రాజు, రాములు, కృష్ణ, రమాదేవి జిల్లా కమిటీ సభ్యులు ఉట్ల కృష్ణ, కసిరెడ్డి, వీరేశం, సువర్ణ, సుమలత, మల్లేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

డి-2 ప్రాంతంలో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

- టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎల్‌బిసి సొరంగంలో ప్రమాద ప్రదేశంలోని డీ-2 ప్రాంతంలో సహాయక చర్యల్లో భాగంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద గురువారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ తెలుసుకునేందుకు డీ- 1, డీ-2, ప్రాంతాల్లో అన్వేషణ జరిగిందన్నారు. ప్రస్తుతం డీ- 2 ప్రాంతంలో పూర్తిస్థాయిలో మట్టి తవ్వకాలు, టిబిఎం కత్తిరింపు పనులు జరుపుతూ సహాయ బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయని వివరించారు. డీ-2 ప్రాంతంలో 5 ఎస్కవేటర్ల సహాయంతో పెద్ద బండ రాళ్లను తొలగిస్తూ, మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకి పంపుతున్నట్టు తెలిపారు. ఊట నీటిని నిర్విరామంగా పంపింగ్ చేస్తున్నామన్నారు. ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని నిషిద్ధ



సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం

ప్రదేశంగా గుర్తించి కంచె ఏర్పాటు చేశామని, ఆ ప్రదేశాన్ని నిరంతరం పరిశీలనలో ఉంచామని చెప్పారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బందికి తగు జాగ్రత్తలు చెబుతున్నామన్నారు. మట్టి తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న బండ రాళ్లను, టిబిఎం భాగాలను ఎప్పటికప్పుడూ తొలగిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర సహాయక బృందాల ఉన్నతాధికారులు, జెపి కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వ్యాపారవేత్త ఫొటోలు మార్ఫింగ్

- కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ మహిళా వ్యాపారవేత్త ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఘటనలో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ మహిళా వ్యాపారవేత్తకు చెందిన ఇన్‌స్టాగ్రామ్ నుంచి ఓ వ్యక్తి ఆమె ఫొటోలు తీసుకుని సాంకేతికత వినియోగించి(ఏఐ) అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడంతోపాటు ఫోన్ నెంబర్ పెట్టి ట్యాగ్ చేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. దాంతో బాధిత మహిళ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతోపాటు మరో మహిళా ఉద్యోగి ఫొటోలను కూడా ఇదే విధంగా పోస్ట్ చేసిన విషయాన్ని ఆమె గుర్తించారు. తమ వద్ద పనిచేసి మానేసిన ఓ యువతిపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాజులరామారంలో దారుణం

- ఇద్దరు పిల్లలను నరికి చంపిన తల్లి.. ఆపై ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలో దారుణ ఘటన జరిగింది. ఇద్దరు కుమారులను వేట కొడవలితో నరికి చంపి అనంతరం తల్లి కూడా ఐదు అంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి గాజులరామారంలో నివసించే తేజస్వినికి ఇద్దరు కుమారులు హర్షిత్ రెడ్డి (11), ఆశిష్ రెడ్డి (9). ఏం జరిగిందో ఏమో.. గురువారం ఇద్దరు పిల్లలను తల్లి వేట కొడవలితో నరికి చంపింది. ఆ తర్వాత ఆమె ఐదు అంతస్తుల భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పెద్ద కుమారుడు తేజ అక్కడికక్కడే మృతిచెందాడు. చిన్న కుమారుడు ఆశిష్ రెడ్డిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో చనిపోయినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో పోలీసులు ఐదు పేజీల సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున మూడు పిచ్చి కుక్కలు ప్రజలపై విరుచుకుపడ్డాయి. దారి వెంట వెళ్లే వృద్ధులు, యువకులతో పాటు ఇంటి ఆవరణలో పనులు చేసుకుంటున్న మహిళలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ దాడిలో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని వెంటనే మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడ్డవారిలో గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబి, మంద రవి, దిశెట్టి సారయ్య, అల్లావుద్దీన్, బిజిగ సాయిలు, కంచ కోమల, కంది పాపయ్య, కట్ల ఎల్లయ్య, కుండె అనూష ఉన్నారు. అలాగే, నాలుగు పశువులపైనా దాడి చేశాయి. గ్రామంలో వీధి కుక్కలు ఒక్కసారిగా విరుచుకోవడంతో గ్రామంలో అనేకమంది గాయపడగా.. పరిస్థితి భయానకంగా మారింది.

మున్నేరులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

- ఖమ్మంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్నేరులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన ఖమ్మం నగరంలో గురువారం జరిగింది. ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసు స్టేషన్ సిఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గాంధీచౌక్‌కు చెందిన అన్నం సుబ్బారావు కుమారుడు కిరణ్ తేజ్ (16), గుట్టలబజార్‌కు చెందిన కూచిపూడి ముద్దుకృష్ణ కుమారుడు బెన్విత్ (16) స్నేహితులు. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన వీరు క్రికెట్ ఆడేందుకంటూ ఇంటి నుంచి బయటకు వచ్చారు. అనంతరం నగర శివారు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ సమీపంలోని మున్నేరు వద్దకు ఈతకు వెళ్లారు. ఈత రాకున్నా నీళ్లలోకి దిగిన వారు ప్రమాదవశాత్తు నీటిలో కాలుజారిపడి మునిగిపోయారు. అనంతరం కొద్దిసేపటికే అదే ప్రాంతానికి ఈతకు వచ్చిన కొందరు ఒడ్డుపై వీరి దుస్తులు గుర్తించి నీటిలో గాలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో కిరణ్ తేజ్, బెన్విత్ మృతి చెందారు. అదే సమయంలో బెన్విత్ తండ్రి ముద్దు కృష్ణ వారిని వెతుకుంటూ అక్కడికి వచ్చాడు. వారిని గుర్తించి బోరున విలపించాడు. సంఘటనపై ముద్దు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్టు సిఐ తెలిపారు .

బిజెపి కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

- 24 నుంచి మే 1 వరకు అమరవీరుల స్మారక వారోత్సవాలు
- ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మిస్తామని ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో రెండురోజులపాటు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలను నిర్వహించారు. అనంతరం రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న ఎండీ గౌస్ నాలుగో వర్ధంతి సభలను నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు అమరవీరులు - అమరజీవుల స్మారక వారోత్సవాలను జరుపుతామని వివరించారు. ఒకటిన మేడేను సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. వచ్చేనెల తొమ్మిదిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు భీం రెడ్డి నరసింహారెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని కార్పొరేట్ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా జరపాలని నిర్ణయించామని తెలిపారు. వచ్చేనెల 12న మచ్చాపూర్ స్మారక స్తూపం వద్ద ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత ఓంకార్ శతజయంతి ప్రారంభ సభను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల 20న కార్మిక, రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ సిహెచ్‌ఒ అసోసియేషన్ అధ్యక్షునిగా బానోత్ నెహ్రూ చందునాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా బానోతు నెహ్రూ చందునాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్ కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ప్రాంగణంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళీధర్ రెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిసి రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి.మధుసూదన్ రెడ్డి, బి.సక్కుబాయి, జి.దుర్గారావు, జ్ఞాన సుందరి, రాష్ట్ర కోశాధికారిగా పి.మహాల, జాయింట్ సెక్రెటరీగా భరత్ కుమార్, రోజారాణి, సుధాకర్‌తో పాటు ఎన్నికైన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ధీరావత్ మోతిలాల్ ఎన్నికైన వారిలో ఉన్నారు. నూతనంగా ఎన్నికైన వారికి పలు ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వెంకర్ కెమికల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- మూడు ఫైర్ ఇంజన్లతో అదుపులోకి మంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పాశ మైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించి, పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వివరాల్లోకెళ్తే.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పాశంమైలారం పారిశ్రామిక వాడలోని వెంకర్ కెమికల్ పరిశ్రమలో గురువారం ఉదయం ఆకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. రియాక్టర్ నుంచి మరొక రియాక్టర్‌లోకి కెమికల్ పంపించే క్రమంలో మంటలు ఎగసిపడ్డాయి. దాంతో అప్రమత్తమైన పరిశ్రమ కార్మికులు, సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పరిశ్రమలోని ఫైర్ సేఫ్టీతో పాటు చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల యజమాన్యాలు స్పందించడంతో పెద్ద ముప్పే తప్పింది. పాశమైలారం పారిశ్రామికవాడ ఫైర్ ఇంజన్‌తో పాటు పటాన్‌చెరు, సంగారెడ్డి నుంచి వచ్చిన మూడు ఫైర్ ఇంజన్ల సహకారంతో అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన మంటలను అదుపులోకి తెచ్చారు. పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు ప్రమాద స్థలంలో లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అగ్ని ప్రమాదంలో రియాక్టర్లు పేలడంతో పరిశ్రమ యాజమాన్యానికి భారీగానే ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో షోరూంలను విస్తరిస్తాం

- ఓయిలర్ మోటార్స్ వాణి రిఖీ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

కార్గో విద్యుత్ వాహనాల తయారీలో ఉన్న ఓయిలర్ మోటార్ తెలుగు రాష్ట్రాల్లో తమ విక్రయ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు ఆ సంస్థ సేల్స్ అండ్ మొబిలిటీ వైస్ ప్రెసిడెంట్ వాణి రిఖీ మెహ్రా తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తమకు హైదరాబాద్‌లో మూడు, విజయవాడ, నెల్లూరులో ఒక్కటి చొప్పున షోరూంలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాదిలో ఇక్కడ మరో 10 అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం తమ పోర్టుపోలియోలో త్రిచక్ర ఎలక్ట్రిక్ కార్గో రిక్షా, మరో నాలుగు చక్రాల ట్రక్ ఇవి ఉందన్నారు. తమ పవర్‌ఫుల్ రిక్షా సింగిల్ చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల మేర ప్రయాణించగలదన్నారు. దీని ధరను రూ.4.5 లక్షలుగా తెలిపారు. ట్రక్ 1.2 టన్ను సరుకు సరఫరా సామర్థ్యం కలిగి ఉందన్నారు. దీని ధర రూ.9 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

మిల్క్‌లేన్‌తో చేతులు కలిపిన మిల్కీ మిస్ట్

న్యూఢిల్లీ : ఇన్నోటెర్రాకు చెందిన పాడి, పశువుల మేత వ్యాపార సంస్థ అయిన మిల్క్‌లేన్ పాల బ్రాండ్‌లలో ఒకటైన మిల్కీ మిస్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ సహకారం ముడి పాల నాణ్యత, సరఫరా గొలుసు పారదర్శకత, కార్యాచరణ సామర్థ్యం వంటి కీలకమైన పరిశ్రమ సవాళ్లను పరిష్కరిస్తుంది. అంతిమంగా రైతులు, వినియోగదారులు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుస్తుందని మిల్క్‌లేన్ ఎండి హరీష్ శర్మ పేర్కొన్నారు. అధిక-నాణ్యత ప్రీమియం పాల సరఫరాతో మిల్కీ మిస్ట్‌కు మద్దతు ఇవ్వాలని మేం లక్ష్యంగా పెట్టు కున్నామన్నారు. ఈ భాగస్వామ్యం తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయనుందని మిల్కీ మిస్ట్ డెయిరీ సిఇఒ డాక్టర్ కె రత్నం పేర్కొన్నారు.

అద్దంకి ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలి

- దీనిపై మండలి చైర్మన్‌ను కలుస్తాం : వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుచిత రాజకీయ విమర్శలు చేస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను పదవి నుంచి తప్పించాలనీ, దీనిపై శాసన మండలి చైర్మన్‌ను తమ పార్టీ ఆధ్వర్యంలో కలుస్తామని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఎలా మాట్లాడాలో కాంగ్రెస్ నేతలకు తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. బిజెపి జాతీయ నాయకులపై అద్దంకి దయాకర్, అంజన్ కుమార్ యాదవ్ మాటలు, వారి భాష కాంగ్రెస్ పార్టీ నైజాన్ని మరోసారి బయటపెట్టిందన్నారు. ప్రధాని మోడీపై దిగజారుడు మాటలు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్, సోనియా తప్పు చేశారు కాబట్టి జైలుకు పోక తప్పదనే అభద్రతతో ఇలా రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. కోర్టులపై విశ్వాసం లేకుండా మాట్లాడటం తగదన్నారు. ప్రధాని మోడీపై అసభ్య పదజాలంతో మాట్లాడిన కాంగ్రెస్ నేతలపై పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.